

రైతులకు 'పూల'బాట !

బోనకల్ మండలం ముష్టికుంట్ల రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యానవన పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. 8లో



కొనసాగుతున్న జాతర

కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కోట మైసమ్మ తల్లి జాతర వైభవంగా సాగుతోంది. శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 23°

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి పాదానికి, శ్రీ స్వామివారి విగ్రహానికి వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం గావించారు. శ్రీవారిని, శ్రీ అలివేలు మంగ, శ్రీ పద్మావతి అమ్మవార్లను సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించగా భక్తులు కనులపండువగా తిలకించారు. ఆ తర్వాత శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ వేంకటేశ్వర అన్నదాన సేవా సమితి నిర్వాహకులు బొబ్బా కృష్ణప్రసాద్, ఎల్వీ నారాయణరెడ్డి, కాకుమాను లీలాకృష్ణ, ఇమ్మడి ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్, చొప్పవరపు శ్రీనివాసరావు, గిరిజాలక్ష్మి, తదితరులు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరి జగన్ మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్ : రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన పర్యటన ప్రారంభం కానుండగా ఖమ్మం నగరంతో పాటు కూసుమంచి, మధిర, వేంసూరు మండలాల్లో కొనసాగుతుంది. ఆయా మండలాల్లో పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

'రేషన్' పక్కదారి పడితే సహించం

కారేపల్లి: రేషన్ బియ్యం పక్కదారి పడితే సహించేది లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ బియ్యం చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి (డీఎస్‌ఓ) చందన్‌కుమార్ అన్నారు. కారేపల్లిలోని సింగరేణి -1, 2 రేషన్ దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రేషన్ దుకాణాల ఎదుట బోర్డు ఏర్పాటు చేసి సరుకుల నిల్వ వివరాలను పొందుపరచాలని, నిర్దేశిత సమయంలో లబ్ధిదారులకు సన్నబియ్యం అందించాలని డీలర్లకు సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫ్లెక్సీలు లేకుండా చూడాలన్నారు.

రేపు అండర్ -19 టీటీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బాలబాలికల టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపికలు ఈనెల 6న ఉదయం 9 గంటలకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డి.ముసాకలీం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు చదువుతున్న వారు పోటీలకు అర్హులని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

ప్రకృతి సేద్యం.. పర్యావరణ హితం



ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంలో సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంట

జిల్లాలో యాసంగి సీజన్ నుంచి పథకం అమలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రెండేళ్ల పాటు నిర్వహణ
- 15 మండలాల్లో 1,875 ఎకరాలు ఎంపిక
- ఇప్పటికే మట్టి నమూనాల సేకరణ, పరీక్షల ప్రక్రియ పూర్తి



వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, పర్యావరణ హితమైన సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రకృతి సేద్యం' పథకానికి శ్రీకారం చుట్టింది. రసాయన రహిత సాగు వైపునకు రైతులను మళ్లించి ఆరోగ్యవంతమైన ఆహారోత్పత్తులను అందించడం ఈ పథకం లక్ష్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని రాష్ట్రంలో 'నేచురల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్'(ప్రకృతి వ్యవసాయ మిషన్) పేరిట అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో బయో రిసోర్స్ కేంద్రాలను కూడా ఏర్పాటుచేస్తారు. జిల్లాలో ఇప్పటికే కొందరు రైతులు సేంద్రియ వ్యవసాయం చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. జిల్లాలోని పలువురు రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ సంస్థల నుంచి అవార్డులు కూడా అందుకున్నారు.

యాసంగి నుంచి అమలు..

ప్రకృతి సేద్యం పథకాన్ని జిల్లాలో యాసంగి సీజన్ నుంచి అమలు చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించింది. వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నేచురల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకాన్ని నిర్వహిస్తాయి. రసాయనాలు లేని పంటల సాగే లక్ష్యంగా ఈ పథకం ప్రారంభమైంది. ఈ నెల నుంచి యాసంగి పంటల సీజన్ ప్రారంభమవుతున్న వేళ జిల్లాలో రూపొందించిన ప్రకృతి సేద్యం పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

కేంద్ర, రాష్ట్రం నుంచి నిధులు..

ప్రకృతి సేద్యం పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండేళ్ల పాటు సంయుక్తంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ పథకం అమలుకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను ఖర్చు చేస్తుంది. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు, వివిధ రకాల ప్రోత్సాహకాలు అందించేందుకు ఈ నిధులు వినియోగిస్తారు. పంటల సాగులో పెట్టుబడి భారాన్ని తగ్గించి, దిగుబడి పెంచే పద్ధతులను ప్రోత్సహించనున్నారు.

పరీక్షలు పూర్తి

ప్రకృతి సేద్యం పథకం కింద ఎంపిక చేసిన క్లస్టర్లలో పంటలు సాగు చేసే భూముల్లో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయించారు. తద్వారా ప్రకృతి సేద్యం చేసే భూముల్లో ఉన్న పోషకాలు, వివిధ పంటలకు అవసరాలు అనే అంశాలపై అధ్యయనం చేసి పోషక లోపాల సవరణలకు కూడా చర్యలు చేపట్టనున్నారు.

15 మండలాల ఎంపిక..

జిల్లాలో 'నేచరల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్' పథకానికి 15 మండలాలను ఎంపిక చేశారు. కామేపల్లి, ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, చింతకాని, మధిర, ఎర్రుపాలెం, వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు మండలాలను ఎంపిక చేయగా.. ఒక్కో మండలం నుంచి ఒకటి, రెండు గ్రామాలను క్లస్టర్‌గా గుర్తించారు. వాటి పరిధిలో 125 మంది రైతులు, 125 ఎకరాల చొప్పున ఎంపిక చేయగా, 15 మండలాల్లో 1,875 మంది రైతులు, 1,875 ఎకరాల భూమిని సేద్యం చేసేలా కార్యాచరణ రూపొందించారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న రైతులనే ఈ పథకానికి ఎంపిక చేశారు. అంతేగాక విషయ పరిజ్ఞానాన్ని సహచర రైతులకు పరిచయం చేయగలిగే వారికి ప్రాధాన్యం ఇచ్చారు. క్లస్టర్ల వారీగా మండలానికి ఇద్దరు చొప్పున 30 మంది సీఆర్పీలను ఎంపిక చేయగా, వారికి గౌరవ వేతనం అందించనున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన సీఆర్పీలకు ఇప్పటికే కేవీకే శాస్త్రవేత్తలు హైదరాబాద్‌లో ఐదు రోజుల పాటు శిక్షణ ఇప్పించారు.

ప్రయోజనకరమైన పథకం



నేచురల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పేరిట రూపొందిన ప్రకృతి సేద్యం పథకం ఎంతో ప్రయోజనకరమైంది. రసాయన రహిత వ్యవసాయం లక్ష్యంగా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. జిల్లా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెరుగుతుంది. ఇప్పటికే పలువురు రైతులు సహజ వ్యవసాయం చేస్తూ ఫలితాలు సాధిస్తున్నారు. యాసంగి సీజన్ నుంచి జిల్లాలో పథకం అమలుకు చర్యలు చేపట్టాం.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

ఆయిల్‌పామ్‌తో స్థిర ఆదాయం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, వేదికపై ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, ఎమ్మెల్యేలు జారె, కూనంనేని

- 'కల్లూరుగూడెం' పూర్తయ్యాక అశ్వారావుపేటలో మరో ఫ్యాక్టరీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు స్థిర ఆదాయం పొందుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగాలపల్లి శివారు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి మంత్రితోపాటు ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, అశ్వారావుపేట, కొత్తగూడెం ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యాక అశ్వారావుపేటలో మరో ఫ్యాక్టరీ నిర్మిస్తామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, అంతర పంటల సాగు పరిశీలనకు ఆయిల్ ఫెడ్ ద్వారా రైతులను పక్క రాష్ట్రాలకు తీసుకెళ్లే ఏర్పాటు చేస్తామన్నారు. ఫ్యాక్టరీలకు గెలలు పోటెత్తిన సందర్భాల్లో జాప్యం చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పామాయిల్ మొక్కలు నాటే ప్రక్రియను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తామని తెలిపారు. భూ ధ్రువ పత్రాలతో సంబంధం లేకుండా సాగుచేసే ప్రతీ రైతుకు ఆయిల్‌పామ్ మొక్కలను ఉచితంగా అందజేస్తామని అన్నారు.

తప్పులను సరిదిద్దుతున్నాం

గతంలో ఆయిల్ ఫెడ్‌లో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామని ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆఫ్ టైప్, నాణ్యతలేని మొక్కలను తొలగించి కొత్త మొక్కలను నాటుతామని తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఫ్యాక్టరీల ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగవుతున్న వరి పంట విస్తీర్ణానికి సమానంగా పామాయిల్ సాగయ్యేలా మంత్రి తుమ్మల కృషి చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రత్యేక రాయితీలు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఖమ్మం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, అలపాటి ప్రసాద్, చల్లగుళ్ల కృష్ణయ్య, చల్ల గుళ్ల నరసింహారావు, కందిమళ్ల కృష్ణారావు, బండి భాస్కర్, మొగళ్ల చెన్నకేశవరావు, కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, పక్కన పద్మావతి తదితరులు

ఖమ్మంవ్యవసాయం: పంటలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులకు అందేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం.. ధాన్యం కొనుగోళ్లు, సీసీఐ పత్తి కొనుగోళ్లపై అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంటల కొనుగోళ్లకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. వానాకాలం వరిసాగు ఆధారంగా 2.60 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం, 40 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యమని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లతో పాటు 3 నుంచి 4 నెలల పాటు మిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తూర్పారబట్టిన తర్వాతే ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ క్లస్టర్ పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఏఈఓలు సర్టిఫై చేయాలన్నారు. అవసరమైన మేరకు తేమ యంత్రాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పత్తి కొనుగోలు సులభతరం చేసేందుకు 'కపాస్ కిసాన్' యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ.. పత్తి ధర పడిపోతున్న నేపథ్యాన కనీస మద్దతు ధర రైతులకు దక్కేలా సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. తేమశాతం ఆధారంగా పంట కొనుగోలు ఉంటుందని, 8శాతం తేమ ఉన్న పత్తికి క్వింటాకు రూ. 8,110 ధర ఉంటుందని తెలిపారు. తేమశాతం పెరుగుతుంటే ధరలో తేడా ఉంటుందని, ఈ విషయమై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో డీఏఓ ధనసరి పుల్లయ్య, డీఎంఓ ఎంఏ అలీం, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

- నామినేషన్ల స్వీకరణకు మండలాల్లో ఏర్పాట్లుచేయాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



వీసీలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్ : స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల విధుల పట్ల అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈనెల 6న మొదటి దశ ర్యాండమైజేషన్ తర్వాత విధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించాలని అన్నారు. నామినేషన్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ప్రచారాలు నిర్వహించొద్దని, అభ్యర్థితో పాటు ముగ్గురిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని తెలిపారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, అదనపు డీఆర్డీఓ జయశ్రీ, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన..

తిరుమలాయపాలెం/ముదిగొండ/నేలకొండపల్లి : స్థానిక సంస్థల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ శనివారం పరిశీలించారు. శనివారం ఆమె తిరుమలాయపాలెం, ముదిగొండ, నేలకొండపల్లి ఎంపీడీఓ కార్యాలయాలను తనిఖీ చేశారు. నామినేషన్ పత్రాలు, పోస్టల్ బ్యాలెట్ కవర్లు తదితర సామగ్రిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ వివరాలు, వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు సిలార్‌సాహెబ్, శ్రీధర్‌స్వామి, ఎం.ఎర్రయ్య, అధికారులు శారదాదేవి, బి.చలపతిరావు, ఏఈ ప్రసాద్, భాస్కర్‌రావు, సిబ్బంది శ్రీనివాస్, మీరా తదితరులు పాల్గొన్నారు

సాగుతున్న సమ్మె



ఖమ్మం ఎస్టీ బాలుర వసతిగృహంలో వంట చేస్తున్న వార్డెన్ (ఫైల్)

- దసరా సెలవుల అనంతరం రేపు తెరుచుకోనున్న హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు
- ఆందోళన బాటలో కుక్‌లు, వర్కర్లు
- విద్యార్థులకు తప్పని ఇక్కట్లు

ఖమ్మంమయూరిసెంటర్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో పనిచేస్తున్న రోజువారీ, ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. పెండింగ్ వేతనాలు విడుదలైనా, ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని కార్మికులు ప్రకటించారు. వేతన బకాయిలు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, తమ డిమాండ్లు నెరవేరే వరకు విధులు బహిష్కరిస్తామని తేల్చిచెబుతున్నారు. దీంతో జిల్లాలోని గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో వంటచేసే వర్కర్లు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దసరా సెలవులతో దాదాపు 15 రోజుల పాటు హాస్టళ్లు మూతపడి ఉండడంతో ఈ సమస్య పెద్దగా కనిపించకపోయినా.. సెలవుల అనంతరం కార్మికుల సమ్మె ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు చెబుతుండడం గమనార్హం.

ఎప్పుడూ లేని విధంగా..

గతంలో వేతనాలు, సమస్యల పరిష్కారం కోసం కార్మికులు సమ్మె చేసినా అది నాలుగైదు రోజుల్లోనే ముగిసేది. కానీ ఈసారి కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెను ఉధృతంగా కొనసాగిస్తున్నారు. ఇటీవల ఖమ్మంలో మంత్రుల క్యాంపు కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టగా.. రాష్ట్ర అధికారులు 6 నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేశారు. అయితే పెండింగ్ వేతనాలే కాదని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, జీతాలు తగ్గిస్తూ తీసుకొచ్చిన జీఓలను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో సమ్మె కొనసాగిస్తున్నారు. కార్మికుల సమ్మెకు కార్మిక, విద్యార్థి సంఘాలు మద్దతు తెలపడంతో.. కనీస సమస్యలు పరిష్కారం అయ్యేవరకైనా పోరు కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రభుత్వ స్పందనపై నిరీక్షణ..

పెండింగ్ వేతనాలు విడుదలైన నేపథ్యంలో, ప్రభుత్వం మిగిలిన డిమాండ్ల పరిష్కారంపై ఎంతవరకు దృష్టి సారిస్తుందనే దానిపై కార్మికులు, విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. వేతన బకాయిల విడుదల కొంత సానుకూల పరిణామమైనా, కార్మికులు తమ భవిష్యత్‌కు భద్రత కోరుకుంటున్నారు. సమస్యల పరిష్కరించేలా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

వారిపై ఒత్తిడి..

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పని చేసే డెయిలీ వేజ్ వర్కర్లు 77 మంది, ఔట్ సోర్సింగ్ వర్కర్లు 45 మంది సమ్మె చేస్తున్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్లిన రోజు నుంచి అక్కడ వారు చేసే పనుల కోసం రోజు వారీ కూలీలను ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు వసతిగృహ సంక్షేమ అధికారులకు సూచించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. అడ్డాపై పని చేసే కూలీలు రోజువారీ కూలీ రూ.600 నుంచి రూ.1,000 వరకు డిమాండ్ చేస్తుండడంతో వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. అసలే బిల్లులు రాక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు రోజు వారీ వేతనాలు చెల్లించి కూలీలను ఎక్కడి నుంచి తీసుకురావాలని మథనపడుతున్నారు. వసతిగృహాల్లో విద్యార్థులకు వంట చేసి పెట్టడం, అధికారులు ఆదేశాలను పాటించడంలో కొంతమంది వార్డెన్లు ఒత్తిడికు లోనవుతున్నారనే చర్చ జరుగుతోంది.

సమస్యలు పరిష్కరించాలి..



ఎన్నో ఏళ్లుగా వసతిగృహాల్లో పని చేస్తున్న మాకు కనీస వేతనాలు ఇవ్వడం లేదు. ఇచ్చే జీతమే తక్కువైనా అవి కూడా నెలనెలా ఇవ్వడం లేదు. నాలుగు డిమాండ్లతో మేం ఐక్యంగా సమ్మె చేస్తున్నాం. అవి పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం. – బాదావత్ లక్ష్మా, కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్



నూతన బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఈ

మధిర: సిరిపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన నూతన బ్రేకర్‌ను విద్యుత్ శాఖ ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి శనివారం ప్రారంభించారు. సిరిపురం సబ్‌స్టేషన్ లిఫ్ట్ ఫీడర్ నుంచి సిరిపురం లిఫ్ట్‌కు, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాలకు సరఫరా అవుతున్న విద్యుత్‌ను, ప్రత్యామ్నాయంగా కలకోట, సిరిపురం లిఫ్ట్ ఫీడర్లుగా విడదీస్తూ సుమారు రూ.8 లక్షల వ్యయంతో నూతన బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం ఒకే బ్రేకర్ మీద సిరిపురం లిఫ్ట్‌కు, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాలకు సరఫరా అవుతున్న విద్యుత్‌ను ప్రత్యామ్నాయ నూతన బ్రేకర్ ఏర్పాటుతో ఈ రెండింటినీ విడదీసి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, రూరల్ సెక్షన్ ఏఈ మైథిలి పాల్గొన్నారు.

యోగా ఆశ్రమం అభినందనీయం



జయరాజ్ దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఏన్కూరు: ప్రకృతితో మమేకమై ఆరోగ్యవంతమైన సమాజం కోసం యోగా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ సినీ గేయ రచయిత, ప్రకృతి కవి జి.జయరాజ్ అన్నారు. మండల పరిధిలోని నాచారంలో ఎస్ఎస్‌వై ప్రకృతి యోగా ఆశ్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అద్భుత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కొండలు, గుట్టలతో ప్రకృతి పరవశించే ప్రదేశంలో ఈ ఆశ్రమాన్ని నెలకొల్పడం హర్షణీయమని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రకృతి పరిరక్షణ, ఆధ్యాత్మిక భావాలతో కూడిన ఆరోగ్య సంరక్షణకు నిర్విరామంగా ప్రయత్నిస్తున్న యోగాచార్యులు డాక్టర్ ప్రేమ్ నిరంతర్ మల్లేష్‌గురూజీ ఆదర్శప్రాయులని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర్, ఎస్ఎస్‌వై నిర్వాహకులు దారా విష్ణుమోహన్‌రావు, దుగ్గిదేవర అజయ్‌కుమార్, కోటగిరి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భద్రాచలంఅర్బన్: అనుమతి లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శనివారం భద్రాచలం పోలీసులు సీజ్ చేశారు. పట్టణంలోని కొల్లుగూడెం వద్ద గోదావరి నుంచి ఇసుక నింపుకుని వస్తుండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

రైతులకు 'పూల'బాట !



ముష్టికుంట్లలో సాగైన బంతి తోట

- పూల సాగుతో లాభాలు
- వరుస నష్టాలతో వాణిజ్య పంటలకు స్వస్తి



రోడ్డు పక్కన పూలు అమ్ముతున్న మహిళ

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యానవన పంటల సాగుకు మొగ్గు చూపారు. గత పది సంవత్సరాలుగా మిరప, పత్తి పంటలు సాగు చేసి నష్టపోగా, వారు ఉద్యాన పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ఉద్యాన పంటల సాగులో అంతర పంటలను వేసి ఏడాదికి మూడు సార్లు పంటల సాగు చేసి దిగుబడులు తీస్తున్నారు.

వందల ఎకరాల్లో సాగు

బంతి, చామంతి, గులాబి పంటలను వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా పండుగ సీజన్లో బంతి, చామంతి, కనకాంబరాలు సాగు చేస్తూ మంచి లాభాలను గడిస్తున్నారు. వినాయక చవితి, బతుకమ్మ సీజన్లతో పాటు కార్తీక మాసాల్లో జరిపే శుభకార్యాలల్లో పూలకు మంచి గిరాకీ ఉంది. బంతి కేజీ రూ. 70 నుంచి 100 వరకు అమ్ముతున్నారు. చామంతి పూలు కేజీ రూ. 500, కనకాంబరాలు రూ. 4000, గులాబీలు కేజీ రూ. 500 వరకు ధర పలుకుతోంది. పూల సాగుకు ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. పూలను అమ్మగా రూ.3 లక్షల ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. పండగ సీజన్ల తరువాత పూలను ఖమ్మం, విజయవాడ మార్కెట్లకు తరలిస్తున్నారు.

లాభసాటిగా ఉంది



పూలసాగు లాభసాటిగా ఉంది. గతంలో మిరప పంట వేసి తీవ్రంగా నష్టపోయాను. మూడు ఎకరాల్లో బంతి పూల సాగు చేపట్టాను. పండుగ సీజన్లో పూలు చేతికందేలా పంటను సాగు చేశాను. దీంతో గిట్టుబాటు ధర లభిస్తోంది.

– బొడ్డుపల్లి నర్సింహారావు, ముష్టికుంట్ల

ఖమ్మం, విజయవాడలో విక్రయం



ఐదెకరాల్లో బంతి, చామంతి, గులాబీ పూల సాగు చేశాను. ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర లభిస్తుండటంతో క్రమంగా పూలను ఖమ్మం, విజయవాడకు సులభతరంగా మార్కెటింగ్ చేస్తున్నా. మంచి ఆదాయం వస్తోంది.

– బొడ్డుపల్లి మల్లికార్జున్‌రావు, ముష్టికుంట్ల

కొనసాగుతున్న. కోటమైసమ్మ జాతర



కోటమైసమ్మతల్లి జాతరకు తరలివచ్చిన భక్తులు

మూడోరోజూ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న భక్తులు



జాతరలో ఏర్పాటుచేసిన జాయింట్ వీల్స్

కారేపల్లి: భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ కోటమైసమ్మతల్లి జాతర మూడోరోజు శనివారం అంగరంగ వైభవంగా కొనసాగింది. ప్రతీ ఏడాది దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాదాయశాఖ, పర్సా ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వహిస్తుంటారు. ఈనెల2న ప్రారంభమైన జాతర 7వ తేదీ వరకు కొనసాగనుండగా.. భక్తులు భారీగా తరలివస్తున్నారు. 'అమ్మా మైసమ్మా.. మా తల్లీ మైసమ్మా..' అంటూ భక్తుల నామస్మరణతో ప్రాంగణం మార్మోగుతోంది.

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. దేవాదాయ శాఖ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పట్టాభిరామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రమోద్ విజయం.. యువతకు స్ఫూర్తి



ప్రమోద్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: గ్రూప్ -1 పరీక్షల్లో మెడికల్ అండ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఎంపికైన ప్రమోద్ సాయిని శనివారం సత్తుపల్లి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సృజన సాహితీ సమాఖ్య నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రమోద్ సాధించిన విజయం నేటి తరానికి స్ఫూర్తిని కలిగిస్తుందని అన్నారు. అనంతరం ప్రమోద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు గట్టే వాసు, జి.రామకృష్ణ, నిర్వాహకులు మధుసూదన్‌రాజు, పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ, నర్సింహారావు, అవినాష్, సంతోష్, ఆషా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలోని స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశా రు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావా చనం, అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వారాంతపు సెలవు దినాలు కావడంతో నిత్యకల్యాణంలో, ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కొనసాగుతున్న నిమజ్జనం

భద్రాచలంటౌన్: భద్రాచలం గోదావరి తీరంలోని ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్‌కు వరుసగా మూడో రోజు శనివారం భారీగా దుర్గామాత విగ్రహాలు నిమజ్జనానికి తరలిచ్చాయి. శరన్నవరాత్రుల సందర్భంగా పూజలు చేసిన భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి అమ్మవారి ప్రతిమలను నిమజ్జనానికి తీసుకొచ్చారు. విగ్రహాలను భారీ క్రేన్ల సహాయంతో వాహనాల నుంచి దించి లాంచీల ద్వారా గజ ఈతగాళ్లు నదిలో నిమజ్జనం చేస్తున్నారు. గోదావరిలో వరద ఉధృతి ఉండటంతో భక్తులను నిమజ్జన ఘాట్ వద్దకు అనుమతించడంలేదు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల చెంతకు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్తులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అతడు అశ్వారావుపేట మండలం బండలగుంపు గ్రామానికి చెందిన సోడెం జోగారావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు తీసుకెళ్లారు. గతనెల 26న ములకలపల్లిలో తప్పిపోయినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమైందని, దీంతో మతిస్థిమితం సక్రమంగా ఉండడం లేదన్నారు.

మాసారు మాకే కావాలి

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఏన్కూరు: 'మా సారు మాకు కావాలి' అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేసిన ఘటన మండల పరిధిలోని తిమ్మారావుపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం చోటుచేసుకుంది. పాఠశాలలో పని చేస్తున్న చంద్రశేఖర్ అనే ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై కొత్త మేడపల్లికి బదిలీ చేయగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. 60 మంది విద్యార్థులున్న పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఒకరిని బదిలీ చేయడంతో ఆందోళనకు దిగారు. ఆయన వల్లనే విద్యార్థులు హాజరు శాతం పెరిగిందని, బాగా చదువుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు.

నేడు సీపీఐ సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్ : సీపీఐ శతాబ్ది సంవత్సర ముగింపు ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో చారిత్రక సభ నిర్వహించనున్నామని, ఆ సభ ఏర్పాట్లను సమీక్షించేందుకు ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటుచేశామని పార్టీ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు జరిగే సన్నాహక సమావేశానికి పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజా, జాతీయ నాయకులు బినయ్ విశ్వం, కె.నారాయణ, అజీజ్ పాషా, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, పుదుచ్చేరి రాష్ట్రాల కార్యదర్శులు హాజరు కానున్నారని తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సభకు 31 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సీపీఐ వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక చారిత్రక ఘట్టాలున్నాయని, నాటి పోరాట చారిత్రక ఘట్టాలను నేటి యువతరానికి తెలియజేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహించనున్నామని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలోనూ, ఆ తర్వాత జరిగిన భూ పోరాటాల్లో సీపీఐ కీలక భూమిక పోషించిందన్నారు. వేల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీకి దక్కిందన్నారు. గ్రామ గ్రామాన శత సంవత్సర సంబరాల సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహించి యువతను కార్యోన్ముఖులను చేస్తామని తెలిపారు.

బలానికి అనుగుణంగా పోటీ..

స్థానిక సంస్థల ఎన్నికలల్లో సీపీఐ బలానికి అనుగుణంగా పోటీ చేయనున్నట్లు హేమంతరావు తెలిపారు. జిల్లాలో కలిసివచ్చే రాజకీయ పార్టీలతో ఎన్నికల సర్దుబాటు ఉంటుందని వెల్లడించారు. సీపీఐకి బలం ఉన్న గ్రామాల్లో తప్పకుండా పోటీ చేస్తామని చెప్పారు.

బీసీ రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తోందని, ఈ విషయంలో కొన్ని పార్టీలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కే జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



వెంకటరత్నం (ఫైల్)

ఎర్రుపాలెం: కట్లేరులో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. మండలంలోని పెగళ్లపాడు గ్రామానికి చెందిన సగ్గుర్తి వెంకటరత్నం(57) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవిస్తాడు. శనివారం సాయంత్రం గ్రామ సమీపంలో కట్లేరులో చేపలు పట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు లోతైన ప్రదేశంలో నీట మునిగి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. అయితే ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ తెలిపారు.

రూ.7 లక్షల విలువైన బాణసంచా పట్టివేత

ఖమ్మంక్రైం: నగరంలోని వన్‌టౌన్ పరిధిలో రూ.7 లక్షల విలువైన టపాసులను అక్రమంగా నిల్వ చేయగా పోలీసులు శనివారం పట్టుకున్నారు. కమాన్‌బజార్‌లో నాళ్ల బాలకృష్ణ అనే వ్యక్తి నిల్వ చేసి ఉంచగా విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కరుణాకర్ వెల్లడించారు. వాటికి లైసెన్స్ లేదని గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

తిరుమలాయపాలెం: ఓ వృద్ధురాలి ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చొరబడి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని దమ్మాయిగూడెంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అందరూ దుర్గామాత నిమజ్జనం హడావిడిగా ఉండగా.. గ్రామానికి చెందిన గోకినపల్లి లచ్చమ్మ అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈ విషయం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఇంట్లోకి చొరబడి పెప్పర్ స్ప్రే ముఖానికి కొట్టి, లైట్ ఆఫ్ చేసి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో వంట పాత్రలు చోరీ

జూలూరుపాడు: జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట పాత్రలను చోరీ చేసిన సంఘటన శనివారం వెలుగుచూసింది. దసరా సెలవుల అనంతరంపాఠశాలలను శనివారం తిరిగి ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు సిద్ధమవుతుండగా కొన్ని వంట పాత్రలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం లక్ష్మీనరసయ్య తెలిపారు.

పిడుగుపాటుతో ముగ్గురికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు: పిడుగుపాటుతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రాంపురం తండాలో శనివారం జరిగింది. తండాకు చెందిన కొర్ర కవిత, ఆమె పదేళ్ల కుమారుడు సంతోష్, తోడి కోడలు జానులు పత్తి చేలోకి కోతులు రాకుండా కాపలా వెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం వచ్చింది. పిడుగుపడటంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో బాధితులను ట్రాక్టర్ సాయంతో వాగు దాటించి, కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

సుజాతనగర్: బహిర్భూమికి వెళ్లి సాగర్ కాల్వలో పడి గల్లంతైన విద్యార్థి లోహిత్ హర్ష(15) మృతదేహం ఏన్కూరు పోలీసులకు శనివారం ఉదయం లభ్యమైంది. సుజాతనగర్‌కు చెందిన బొమ్మనబోయిన లోహిత్ హర్ష శుక్రవారం సాయంత్రం ఏన్కూరు మండలం రాజలింగాలకు సమీపంలోని సాగర్ కాల్వలో గల్లంతైన విషయం విదితమే. దీంతో ఏన్కూరు పోలీసులు, రెస్క్యూ టీం ఆధ్వర్యంలో గాలింపు చేపట్టగా శనివారం ఉదయం మృతదేహం లభ్యమయింది. మృతదేహానికి ఖమ్మంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సుజాతనగర్‌లో మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

కోతులు, కుక్కలను తరిమినోళ్లకే..

ఓటేస్తామంటున్న పల్లె ఓటర్లు

- గ్రామాల్లో శునకాలు, వానరాల బెడద తీవ్రం
- నిత్యం పదుల సంఖ్యలో దాడి ఘటనలు
- పంటల చేలను నాశనం చేస్తున్న కోతులు



వీధి కుక్కల హల్‌చల్



గ్రామాల్లో సంచరిస్తున్న కోతులు

బూర్గంపాడు: సాధారణంగా ఎన్నికలు వస్తే రోడ్లు, డ్రెయినేజీలు, ఇళ్లు లేవని, పింఛన్లు రాలేదని పోటీ చేసే అభ్యర్థులను ఓటర్లు డిమాండ్ చేస్తుంటారు. అభ్యర్థులు కూడా వాటిపైనే హామీలిస్తుంటారు. కానీ ఈసారి పరిస్థితి మారింది. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో కోతులు, కుక్కల నివారణే ప్రధాన ఏజెండాగా మారనుంది. పాతికేళ్లుగా గ్రామాల్లో కోతుల బెడద పెరుగుతోంది. అదేస్థాయిలో కుక్కలు కూడా పెరిగిపోయాయి. కోతులు, కుక్కల దాడుల్లో పలువురు గాయపడుతున్నారు. జనాలు ఇళ్లలోంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. కోతులు, కుక్కల బెడదను నివారించే అభ్యర్థులకే ఓటేస్తామనే డిమాండ్ ఓటర్ల నుంచి వస్తోంది.

పంట చేలల్లోనూ కిష్కింధకాండ

రాష్ట్రంలో అటవీ ప్రాంతంగా పేరున్న జిల్లాలో పోడు సాగు ప్రభావంతో కోతులు గ్రామాల వైపు మళ్లాయి. పట్టణాల్లో కూడా కోతుల బెడద తీవ్రంగానే ఉంది. ఇళ్లను చిందరవందర చేయటంతోపాటు పిల్లలను, మహిళలను, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. చేతులలో ఏదైనా కవర్ కనిపిస్తే చాలు ఎగబడి దాడిచేసి లాక్కుపోతున్నాయి. ఇంటి పెరళ్లలో కూరగాయ, పూలమొక్కలు వేసుకునే పరిస్థితులు లేవు. జిల్లాలో రోజూ కనీసం నాలుగైదు చోట్ల కోతుల దాడులలో ప్రజలు గాయపడుతున్నారు. ఇక పంటచేలను కోతుల మందలు నాశనం చేస్తున్నాయి. పత్తి కాయలను కొరికి పడేస్తున్నాయి. వరికంకులను విరిచేస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు కాపలా మనుషులను పెట్టుకోవాల్సివస్తోంది.

అభ్యర్థులు ఏమి చెబుతారో..

ప్రస్తుతం ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఓటర్లు మాత్రం ఈసారి స్థానిక ఎన్నికలలో కోతులు, కుక్కల నివారణ కోసం ఏమి చేస్తారని అభ్యర్థులను నిలదీసే పరిస్థితులున్నాయి. కొన్నిచోట్ల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు లిఖిత పూర్వకంగా కోతులను, కుక్కలను తరిమేస్తామనే హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ముందస్తుగా కోతులు, కుక్కలు తరిమించే చర్యలు చేపట్టిన వారిని ఏకగ్రీవంగా గెలిపిస్తామని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

రోజుకు 20 మందికి కుక్క కాటు..

గ్రామాల్లో వీధి కుక్కలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే రక్షణగా చేతిలో కర్ర తెచ్చుకోవాల్సి వస్తోంది. పదేళ్లుగా కుక్కల నివారణ చర్యలు చేపట్టడంలేదు. దీంతో కుక్కల దాడిలో పలువురు గాయాలపాలవుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోజూ 20కుపైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. పలువురు రేబిస్ వ్యాధి బారిన పడుతున్నారు. ఇటీవల పినపాక మండలంలో ఓ వ్యక్తి కుక్క కాటుతో రేబిస్ సోకి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కలు, కోతుల నివారణ చర్యలు తీసుకోవాలని ఏళ్ల తరబడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొన్నిసార్లు అక్కడక్కడా కోతులను పట్టించే కార్యక్రమాలు చేపట్టారు. అవి కూడా తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు.